సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 18 । నవంబర్ । 2024



సోమశిలలో 69.984 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 69.984 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 7,444 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. డెల్టాకు 50, ఉత్తరకాలువకు 550, కండలేరుకు 3 వేలు, దక్షిణకాలువకు 400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.76,430
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ6,937
3 శాతం జీఎస్టీతో	రూ.7,145
నవర (8 గ్రా)	రూ.57,160

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.6 /28.4

జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతంగా ఉండి అక్కడక్కడ చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. ఆదివారం గాలిలో తేమ 79 శాతం ఉంది.

న్యూస్‌రీల్

ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

నెల్లూరు (టౌన్): జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్ష, ఆర్జేడీ కార్యాలయాల్లో మూడేళ్ల పైబడి పనిచేస్తున్న ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని రాష్ట్ర విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ పార్వతి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. రిలీవ్ చేసిన ఉపాధ్యాయులను ఆయా పాఠశాలలకు పంపాలన్నారు. వారి స్థానంలో కొత్త వారిని నియమించుకోవాలని ఈ ప్రక్రియను మంగళవారం నాటికి పూర్తి చేయాలన్నారు. ఈ ఆదేశాలను పాటించకపోతే బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయం, సమగ్రశిక్ష కార్యాలయాల్లో మూడేళ్ల పైబడిన ఉపాధ్యాయులు ఏడుగురు ఉన్నట్లు సమాచారం. వీరిని వెంటనే రిలీవ్ చేయాల్సి ఉంది. ఈ విషయంపై డీఈఓ బాలాజీరావును సంప్రదించగా అధికారికంగా మాకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదన్నారు. డిప్యుటేషన్‌పై వచ్చిన ఉపాధ్యాయులు మూడేళ్ల పైబడితే రిలీవ్ కావాల్సి ఉంటుందన్నారు.

తెలుగు టీచర్‌పై పోలీసులకు ఫిర్యాదు

కలిగిరి: ఓ విద్యార్థిని కొట్టి టీసీ ఇచ్చి పంపాడని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు మన్నం శ్రీనివాసులుపై ఆదివారం చేవూరి ఆనంద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలిలా ఉన్నాయి. బాలల దినోత్సవం సందర్భంగా ఈ నెల 14వ తేదీ పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థి అభిషేక్ ఆ సమయంలో మైకు వైరు తొలగించాడని ఉపాధ్యాయుడు శ్రీనివాసులు ఆగ్రహించాడు. ఆ విద్యార్థిని తన గదిలోకి తీసుకెళ్లి కొట్టి కులం పేరుతో దూషించాడని, అనంతరం బలవంతంగా టీసీ ఇచ్చి పంపారన్నారు. దీంతో పాఠశాలకు వెళ్లి ప్రధానోపాధ్యాయుడిని ప్రశ్నించగా మీరు వెళ్లి ఆ ఉపాధ్యాయుడితో మాట్లాడుకోవాలని చెప్పాడన్నారు. తెలుగు ఉపాధ్యాయుడు శ్రీనివాసులు 'మీ కుమారుడు పాఠశాలకు వస్తే ఒప్పుకునేది లేదని తీవ్రస్థాయిలో బెదిరింపులకు దిగుతున్నాడని' పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో వివరించారు. ఫిర్యాదుపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

25 నుంచి పాఠశాలల పనివేళల్లో మార్పు

నెల్లూరు (టౌన్): పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా జిల్లాలోని మండలానికి ఒక పాఠశాలను ఎంపిక చేసి ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహించాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ నుంచి జిల్లా విద్యాశాఖకు ఆదేశాలు అందాయి. ఈ మేరకు డీఈఓ ఆర్.బాలాజీరావు అన్ని మండలాల డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 20వ తేదీ నాటికి మండలంలో హైస్కూల్ లేదా హైస్కూల్ ప్లస్‌ను డిప్యూటీ డీఈఓ గుర్తించి ఎంపిక చేయాలన్నారు. పాఠశాలల పనివేళల మార్పుపై గైడ్‌లైన్స్ విడుదల చేశారు. ఉదయం 9 గంటలకు మొదటి బెల్, 9.05 గంటలకు రెండో బెల్, 9.05 నుంచి 9.25 గంటల వరకు స్కూల్ అసెంబ్లీ, 9.25 నుంచి 10.15 వరకు తొలి పీరియడ్, 10.15 నుంచి 11 గంటల వరకు రెండో పీరియడ్, 11 నుంచి 11.15 వరకు షార్ట్ బ్రేక్, 11.15 నుంచి 12 వరకు మూడో పీరియడ్, 12 నుంచి 12.45 వరకు నాలుగో పీరియడ్, 12.45 నుంచి 1.45 వరకు లంచ్ బ్రేక్ ఇవ్వాలన్నారు. మధ్యాహ్నం 1.45 నుంచి 2.30ల వరకు ఐదో పిరియడ్, 2.30 గంటల నుంచి 3.15 వరకు 6వ పీరియడ్, 3.15 నుంచి 3.30 వరకు షార్ట్ బ్రేక్, 3.30 నుంచి 4.15 వరకు ఏడో పీరియడ్, 4.15 నుంచి 5 గంటల వరకు ఇంగ్లిష్ పీరియడ్‌ను నిర్వహించాల్సి ఉంటుందన్నారు. పాఠశాలల్లో పని వేళల మార్పుపై ఈ నెల 30న విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖకు పంపించాలన్నారు.

సాగునీటి కాలువ పనుల్లో అవినీతి ప్రవాహం

- సర్వేపల్లిలో రూ.6 కోట్లతో పూడికతీత పనులు
- టెండర్లు ఆహ్వానించినా.. ఓపెన్ చేయనివ్వకుండా అడ్డుకుంటున్న వైనం
- అత్యవసరం పేరుతో ముందస్తు వ్యూహం
- తమ్ముళ్లకు పనుల పందేరం
- కాలువల్లో తూతూ మంత్రంగా తొలగింపు
- సాగునీరు విడుదలతో బయటపడిన నాణ్యతా బండారం
- చివరి ఆయకట్టుకు నీరందక రైతుల లబోదిబో
- పనుల నాణ్యతపై విజిలెన్స్ విచారణకు డిమాండ్

సర్వేపల్లి నియోజకవర్గంలో పంట కాలువల్లో సాగునీటి పారుదలకు అవినీతి ప్రవాహం అడ్డుపడుతోంది. పూడికతీత పనుల పేరుతో నిధులు ఆరగించేందుకు స్థానిక టీడీపీ నేతలు ఓ పథకం ప్రకారం అత్యవసరం పేరుతో తమ్ముళ్లకు పందేరం చేశారు. టెండర్లు ఆహ్వానించినా ఓపెన్ చేయనివ్వకుండా అడ్డుకుంటూ టెండర్ ప్రక్రియను అపహాస్యం చేస్తున్నారు. టెండర్ల ఖరారుకు ముందే పనులు ప్రారంభించి తూతూ మంత్రంగా చేసి రూ.కోట్లు కాజేశారు. ఇటీవల సాగునీటి కాలువలకు నీరు విడుదల చేయడంతో పూడిక తీతలో అవినీతి బాగోతం బయటపడింది. కాలువల్లో పరిస్థితి చూస్తే ఆయకట్టు చివరి వరకు సాగునీరు అందే పరిస్థితి కనిపించడం లేదని రైతులు లబోదిబోమంటున్నారు.



పొదలకూరు మండల పరిధిలోని కనుపూరు కాలువలో నామమాత్రంగా తీసిన పూడికతీత

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నియోజకవర్గంలో పలు కాలువల్లో పూడిక తీతకు ఇటీవల ఓఅండ్ఎం (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) ద్వారా పూడిక తీత, మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. రూ.6 కోట్ల అంచనాలతో 23 పనులకు గత నెల 28న టెండర్లను ఆహ్వానించింది. ఈ నెల 11వ తేదీ వరకు బిడ్స్ దాఖలు చేసేందుకు గడువిచ్చారు. అయితే ఆ నిధులతో టెండర్ల ప్రక్రియకు ముందే అత్యవసరం అంటూ ఎక్కడికక్కడ తమ్ముళ్లకు పనులు పందేరం చేసి ప్రారంభించారు. ఆయా పనుల్లో నాణ్యత లేకపోవడంతో సాగునీరు ముందుకు సాగే పరిస్థితి కనిపించడం లేదు. యంత్రాల ద్వారా నామమాత్రంగా పనులు చేసి చేతులు దులుపుకోవడంతో ఎక్కడికక్కడ పూడిక పేరుకుపోయింది. పొదలకూరు మండలం విరువూరు వద్ద కనుపూరు కాలువ పరిస్థితి చూస్తే పూడికతీత పనుల నాణ్యతకు అద్దం పడుతోంది.

సాగునీటి విడుదలతో..
బయటపడిన అవినీతి బాగోతం

ఇరిగేషన్ సెంట్రల్ డివిజన్ పరిధిలో ఉన్న వెంకటాచలం మండలంలోని తిక్కవరపుపాడు బ్రాంచ్ కెనాల్, కనుపూరు మెయిన్ కెనాల్, ముద్దమూడి బ్రాంచ్ కెనాల్, కాకుటూరు కొత్త ట్యాంక్ సప్లయి చానల్, సూరేపల్లి వాగు కెనాల్, చవిటిమడుగు, గొల్లమూడి అనకేపల్లి మైనర్ డ్రెయిన్, పూడిపర్తి మెయిన్ డ్రెయిన్, గురివిందపాడు బ్రాంచ్ కెనాల్, శ్రీరామపురం ట్యాంక్, కొమ్మలపూడి, సింగారెడ్డి మెయిన్ డ్రెయిన్‌లో చేపట్టిన పూడికతీత పనుల్లో నాణ్యతా ప్రమాణాలు లేకుండా మమ అనిపించారు. ఆయా కాలువల కింద ప్రస్తుతం నాట్లు వేసే దశలో ఉండడంతో సోమశిల నీరు విడుదల చేశారు. నీరు విడుదల చేయడంతో నాణ్యత గురించి పట్టించుకోనే పరిస్థితి లేనందున ప్రభుత్వ నిధులు పక్కదారి పట్టించేలా స్కెచ్ వేసి సఫలమయ్యారు.

టెండర్లను ఓపెన్ చేయనివ్వకుండా..

ఈ నెల 11వ తేదీ వరకు టెండర్ల దాఖలకు గడువిచ్చిన అధికారులు ఆ గడువు తీరి వారం రోజులు దాటుతున్న దాఖలైన టెండర్లను ఓపెన్ చేయలేదు. నెల్లూరురూరల్ పరిధిలో వేసిన టెండర్లను ఓపెన్ చేసి పనులు ప్రారంభించిన అధికారులు సర్వేపల్లిలో మాత్రం వారం గడుస్తున్నా.. టెక్నికల్ ప్రాబ్లం అంటూ ఓపెన్ చేయకుండా తాత్సారం చేయడం వెనుక రాజకీయ ఒత్తిళ్లే కారణమని పలువురు కాంట్రాక్టర్లు చెబుతున్నారు. సర్వేపల్లిలో ఇప్పటికే పనులు పూర్తి చేయడంతో ఇతరులకు టెండర్లు వేస్తే బిల్లులు విషయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఇప్పటికే కొందరు కాంట్రాక్టర్లకు బెదిరింపులు వచ్చినా టెండర్లు దాఖలు చేయడంతో ఆ దాఖలైన టెండర్లను డిస్ క్వాలిఫై చేసేందుకు ఓపెన్ చేయకుండా అడ్డుకుంటున్నారన్న ప్రచారం ఉంది.

టెండర్లు ఎవరూ వేయకూడదని..

రైతుల సాగునీటి అవసరాలకు అత్యవసరమైన పనులను గుర్తించి ఆయా పనులకు అంచనాలు రూపొందించి టెండర్లను ఆహ్వానించారు. అయితే టెండర్ ప్రక్రియ విధివిధానాలను అపహాస్యం చేస్తూ పూడికతీత పనుల పేరుతో నిధులు ఆరగించేందుకు షాడో ఎమ్మెల్యే ఓ పథకం ప్రకారం పనులు ప్రారంభించారు. టెండర్లలో పనులకు దక్కించుకునే కాంట్రాక్టర్లు చేయాల్సిన పనులను తమ్ముళ్ల ద్వారా చేపట్టి టెండర్ల ప్రక్రియను అభాసుపాలు చేశారు.



యంత్రాలతో కాలువ కట్టలను చెక్కి కట్ట పటిష్ట పరుస్తున్న దృశ్యం (ఫైల్)

విజిలెన్స్ విచారణకు డిమాండ్

గత ప్రభుత్వ హయాంలో భారీ వర్షాలతో వరదలు వచ్చి కనుపూరు కాలువకు గండ్లు ఏర్పడ్డాయి. అప్పట్లో పంటలు సాగు చేసి ఉండడంతో ఆ పంటలను రక్షించుకునేందుకు తాత్కాలిక మరమ్మతుల కోసం టెండర్లకు ఆహ్వానించకుండా నామినేషన్‌పై యుద్ధ ప్రాతిపదికన పనులు చేయించారు. ఆ విధానాన్ని తప్పు పట్టిన ప్రస్తుత ఎమ్మెల్యే ఆయా పనులపై విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. కానీ ప్రస్తుతం సర్వేపల్లిలో టెండర్ల ప్రక్రియను అభాసుపాలు చేస్తూ పనులు ప్రారంభించి జేబులు నింపుకోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సర్వేపల్లి సాగునీటి కాలువల మరమ్మతుల పనుల్లో జరిగిన అవకతవకలపై విజిలెన్స్ విచారణ చేయాలని స్థానిక రైతులు డిమాండ్ చేస్తున్నారు. అవినీతికి సహకరిస్తున్న ఇరిగేషన్‌శాఖ అధికారులపై చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

స్వర్ణ లింగేశ్వరునికి వైభవంగా కుంభాభిషేకం



మహాకుంభాభిషేక మహోత్సవంలో పూజలు నిర్వహిస్తున్న శృంగేరి, తపోవనం పీఠాధిపతులు

నెల్లూరు (బృందావనం): నెల్లూరు స్వర్ణాల చెరువు గణేష్‌ఘాట్ కొలువైన స్వర్ణలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం కుంభాభిషేక మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. వెయ్యేళ్ల క్రితం కాకతీయ మహారాజా ప్రతాపరుద్రుడు నిర్మించిన ప్రాచీన స్వర్ణలింగేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ మహాకుంభాభిషేక మహోత్సవాలు జరుగుతున్నాయి. శృంగేరి దక్షిణమ్నాయ, శ్రీశారదాపీఠం ఉత్తర పీఠాధిపతులు విదుశేఖర భారతి, తుని తపోవనం పీఠాధిపతులు సచ్చిదానంద సరస్వతి స్వామి కరకముల మీదుగా కుంభాభిషేక హోమాలు, మహాపూర్ణాహుతి, నూతన గణేశ, మూషిక, నంది విగ్రహాల ప్రతిష్ట, బలిపీఠాలు ప్రతిష్టించి పూజ కార్యక్రమాలు విశేషంగా నిర్వహించారు. పవిత్రతీర్థ కుంభజలాలతో స్వర్ణలింగేశ్వరస్వామికి పరివార దేవతలు విఘ్నేశ్వరస్వామి మూషిక, నంది ద్వయానికి పవిత్ర మంత్రోచ్ఛరణతో కుంభాభిషేక మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. మండల పూజల అనంతరం దివ్యక్షేత్రాల రీతిలో అభిషేక పూజలు నిర్వహించేలా ఏర్పాట్లు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సతీమణి ఉష, మంత్రి పి.నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆర్టీసీ నెల్లూరు రీజియన్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి దంపతులు, స్వర్ణ భారత్‌ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్‌రావు దంపతులు, డిప్యూటీ మేయర్ పోలుబోయిన రూప్‌కుమార్ యాదవ్, కార్యక్రమ సమన్వయకర్త పి.సురేంద్రరెడ్డి, గీత దంపతులు తదితరులు పాల్గొన్నారు. విజయవాడ ఆగమ విద్వాన్ కందుకూరి వెంకటసత్య బ్రహ్మాచార్య రచించిన శివరూపాలు పరమేశ్వరి 25 రూపాలు కథల సంపుట పుస్తకావిష్కరణను విధుశేఖర భారతి మహాస్వామి, ఆవిష్కరించారు.

శాంతి కల్యాణం నేడు

కామాక్షి సమేత స్వర్ణలింగేశ్వర స్వామి వారికి కుంభాభిషేక మహోత్సవాల అనంతరం సోమవారం సాయంత్రం 6 గంటలకు శాంతి కల్యాణం నిర్వహించనున్నట్లు సమన్వయకర్త పి.సురేందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. భక్తులు శాంతి కల్యాణంలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థ,ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలి

- బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు
- ఎక్సైజ్ డీసీ శ్రీనివాసరావు



డీసీ టి. శ్రీనివాసరావు

నెల్లూరు(క్రైమ్): మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి. శ్రీనివాసరావు వ్యాపారులను హెచ్చరించారు. ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు విక్రయిస్తే కేసు నమోదు, రూ.5 లక్షల జరిమానా విధిస్తామన్నారు. రెండో సారి కేసు నమోదైతే వ్యాపారి లైసెన్సును రద్దు చేస్తామని హెచ్చరించారు. దుకాణాల్లో సీసీ కెమెరాలు, బయట మద్యం ధరలను డిస్‌ప్లే చేయాలన్నారు. ఒక వ్యక్తికి గరిష్టంగా మూడు బాటిళ్లను మాత్రమే విక్రయించాలన్నారు. బార్ల నిర్వాహకులు, మద్యం వ్యాపారులు నిర్ణీత వేళల్లోనే మద్యం విక్రయాలు సాగించాలని, లేని పక్షంలో కేసులు తప్పవన్నారు. బెల్టు షాపులను పూర్తి స్థాయిలో కట్టడి చేసేందుకు దాడులు ముమ్మరం చేశామన్నారు. అందులో భాగంగా ఈ నెల ప్రారంభం నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 113 కేసులు నమోదు చేసి 274 లీటర్ల మద్యంను స్వాధీనం చేసుకున్నామన్నారు. 113 మంది నిందితులను అరెస్ట్ చేశామన్నారు. బహిరంగ మద్య సేవనం పైనా కేసులు నమోదు చేస్తున్నామని చెప్పారు. కల్లు సీజన్ కావడంతో కల్తీ కల్లు విక్రయాలు జరగకుండా కల్లు దుకాణాల్లో శాంపిల్స్‌ను సేకరించి పరీక్షలకు పంపుతున్నామన్నారు. పొరుగు మద్యం విక్రయాలను ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. నాటుసారా తయారీ, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. మద్యం అక్రమాలపై స్థానిక ఎక్సైజ్ అధికారులతో పాటుగా 94409 02509, 83746 84689 నంబర్లకు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఆక్రమణల పర్వం.. అప్రతిహతం



ప్రభుత్వ భూమిలో జేసీబీతో చెట్లు తొలగిస్తున్న దృశ్యం



తాత్కాలిక హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న అధికారులు

- అడ్డుకోవడం ఎవరితరం?
- హెచ్చరిక బోర్డులతో సరి
- మళ్లీ మళ్లీ ఆక్రమణలకు యత్నాలు

కూటమి నేతలు బరి తెగిస్తున్నారు. ప్రభుత్వ భూములను ఇష్టారీతిన ఆక్రమిస్తున్నా అధికార యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది. టీడీపీ నేతల భూఆక్రమణలపై మీడియాల్లో కథనాలు వస్తే అట్టముక్కలతో తాత్కాలిక బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకొంటున్నారు. ఎక్కడ ఖాళీగా కనిపిస్తే.. ఆ భూముల్లో పాగా వేస్తూ టీడీపీ పచ్చ ముఠాలు రెచ్చిపోతున్నాయి. తమ భూదందాను అడ్డుకోవడం ఎవరితరం కాదంటూ రెవెన్యూ అధికారులకే సవాల్ విసురుతున్నారు.

మర్రిపాడు: మండలంలో ప్రభుత్వ భూముల్లో ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. నిత్యం ఏదో ఒక గ్రామంలో కబ్జాదారులు ఖాళీ భూముల్లో యంత్రాలను పెట్టి చదును చేస్తుండడం కనిపిస్తోంది. మీడియాలో ఆక్రమణలపై కథనాలు వస్తే అధికారులు ఆ భూములను పరిశీలించి అట్టముక్కలపై స్కెచ్ పెన్నుతో రాసిన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. అధికారులు అటువెళ్లిపోగానే బోర్డులు పీకిపారేస్తున్నారు. దాని పక్కనే మరో భూమిలో జెండాలు పాతి ఆక్రమణల పర్వాన్ని నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు జోరందుకున్నాయి. ఆ పార్టీ నేతలు గ్రామ అడంగళ్‌ను ఆన్‌లైన్‌లో సెర్చ్ చేస్తూ ఎక్కడ ప్రభుత్వ భూములు ఉన్నాయో గుర్తిస్తున్నారు. ఆ భూమిని సొంతం చేసుకునేందుకు రాత్రికి రాత్రే చదును చేస్తున్నారు. ఇప్పటికే మండలంలో దాదాపు వందలాది ఎకరాల్లో టీడీపీ నేతలు పాగా వేశారు. గత కొన్ని నెలలుగా ప్రతి నిత్యం జరుగుతున్నప్పటికీ కొన్ని విషయాలు మీడియా ద్వారా అధికారుల దృష్టికి వస్తుండడంతో వాటిపై అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అయితే వారి దృష్టికి రాకుండా ఉంటే మాత్రం ఆక్రమణ కొనసాగిపోతూనే ఉంది.

హెచ్చరిక బోర్డులు బేఖాతరు

మండలంలోని కదిరినేనిపల్లి, సింగనపల్లి, బాట, కంపసముద్రం, నందవరం తదితర గ్రామాల్లో భూఆక్రమణలు జరుగుతుండడంతో మీడియాలో కథనాలు రావడంతో స్పందించిన అధికారులు ఆయా భూముల్లో తాత్కాలిక హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే ఆక్రమణదారులపై చర్యలు తీసుకుపోవడంతో హెచ్చరిక బోర్డులను వారు బేఖాతరు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. నాలుగు రోజులుగా చిన్నమాచనూరు రెవెన్యూ పరిధిలోని కదిరినేనిపల్లి గ్రామ సర్వే నంబర్1లో ప్రభుత్వ భూమిలో జేసీబీ సహాయంతో చెట్లు తొలగించి చదును చేసే పనులను నిర్వహిస్తున్నారు. గత నెలలో ఇదే సర్వే నంబర్‌లో భూమిని ఆక్రమణదారులు ఆక్రమించేందుకు యత్నించగా మీడియాలో కథనాలు రావడంతో అధికారులు అక్కడ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసిన విషయం విదితమే. అయితే మళ్లీ ఆక్రమణదారులు అదే సర్వే నంబరులో భూమిని ఆక్రమించేందుకు చెట్లు తొలగింపు చేపట్టారు. సామాజిక మాధ్యమాల్లో అధికారుల దృష్టికి ఈ విషయం వెళ్లడంతో ఆదివారం హుటాహుటిన స్పందించి మళ్లీ తాత్కాలిక హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు

ప్రభుత్వ భూమిలో చెట్లు తొలగించి చదును చేసి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే మా దృష్టికి వచ్చిన ఆక్రమణ భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం. ఆక్రమణదారులపై జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు తీసుకుంటాం. – **సాయి, ఆర్ఐ, మర్రిపాడు**

ఉపాధిలో అవినీతికి పాతర

- రాపూరు మండలంలో టీడీపీ నేతల ధనదాహం
- పనుల్లో రూ.కోట్లల్లో దిగమింగిన వైనం
- సోషల్ ఆడిట్‌లో బట్టబయలు
- రికవరీ తగ్గించేందుకు అధికారులపై ఒత్తిళ్లు
- రూ.లక్షల్లో ముడుపులు అందజేత

నెల్లూరు (పొగతోట): కూలీలకు ఉపాధి కల్పించేందుకు చేపడుతున్న ఉపాధి హామీ పనుల్లో టీడీపీ నేతల ధనదాహం పెరిగింది. అధికారాన్ని అడ్డం పెట్టుకుని అడ్డంగా దోచేస్తున్నారు. ఉపాధి హామీ సిబ్బంది, అధికార పార్టీ నాయకులు కుమ్మక్కై పనులు జరగకుండానే జరిగినట్లు చూపించి నిధులు స్వాహా చేస్తున్నారు. రాపూరు మండలంలో ఈ నెల 16వ తేదీన సోషల్ ఆడిట్ నిర్వహించారు. టీడీపీ నేతలు రూ.కోట్లలో అవినీతికి పాల్పడినట్లు అధికారులు నిర్ధారించారు. ఆయా పనుల్లో అధికార పార్టీ నాయకుల ప్రమేయం ఉండడంతో సోషల్ ఆడిట్ సిబ్బందిపై ఒత్తిడి తెచ్చి పనులు జరగకపోయినా జరిగినట్లు చూపించారు. ఎంత తగ్గించినా.. దాదాపు రూ.76 లక్షలకు పైగా లెక్కలు తేల్చినట్లు సమాచారం. అయితే ఇందులో కూడా రికవరీ మొత్తం తగ్గించాలని సామాజిక తనిఖీ బృందానికి భారీ స్థాయిలో రూ.లక్షల్లో ముడుపులు అందించినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ విషయం జిల్లా అధికారుల దృష్టికి రావడంతో విషయం బయటకు పొక్కింది. సామాజిక తనిఖీ నిర్వహణలో జిల్లా అధికారులకు, మండల సిబ్బందికి మధ్య పొత్తులు కుదరలేదు. దీంతో భారీ స్థాయిలో అవినీతి జరిగినట్లు నమోదు చేశారంటూ ఎదురుదాడి చేస్తున్నారు. వాస్తవానికి సోషల్ ఆడిట్ గ్రామస్తులు, కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్, టీఏ, ఇతర సిబ్బంది సమక్షంలో పనులను పరిశీలించి ఎంత మేర జరిగిందో నిర్ధారిస్తారు. చివరగా మండల స్థాయిలో సోషల్ ఆడిట్‌లో రికవరీలు ఖరారు చేస్తారు. అయితే ఆయా పనుల్లో టీడీపీ నాయకుల ప్రమేయం ఉండడంతో సోషల్ ఆడిట్ సిబ్బంది కూడా పెనాల్టీ తగ్గించి నమోదు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా సోషల్ ఆడిట్‌లో ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇద్దరు టీఏలను సస్పెండ్ చేసినట్లు సమాచారం. అయితే వారిని సస్పెండ్ చేసిన ఉత్తర్వులు కార్యాలయం నుంచి ఇంత వరకు సిబ్బందికి అందలేదని తెలుస్తోంది.

కఠిన చర్యలు తీసుకుంటాం

ఉపాధి హామీలో అవినీతిని సహించేది లేదు. రాపూరు మండలంలో సామాజిక తనిఖీ సమయంలో రూ.70 లక్షలు పైగా అవినీతి జరిగినట్లు నిర్ధారించడం జరిగింది. దానికి సంబంధించి ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇద్దరు టీఏలను సస్పెండ్ చేయాలంటూ ఆదేశాలు జారీ చేశాం. మండలంలో పెనాల్టీ పడిన ప్రతి పంచాయతీకి సంబంధించిన ఎఫ్ఏలకు నోటీసులు జారీ చేశాం.
– గంగాభవాని,డ్వామా పీడీ

రైతులపై ధరల పిడుగు

నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్‌బీకే హబ్‌లను ఏర్పాటు చేసింది. గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలకు ఎరువులు, పురుగు మందులు చేరేవి. అక్కడి నుంచి అన్నదాతలు పొలాలకు తీసుకెళ్లేవారు. దీని ద్వారా కేవలం ఎరువు ధర మాత్రమే భరించేవారు. రవాణా ఖర్చులు మిగిలేవి. అంతే కాకుండా అదనపు ధరలు కూడా ఉండేవి కావు.

నేడు కూటమి ప్రభుత్వం రైతులను గాలికొదిలేసింది. గత ప్రభుత్వ విధానాలను ఎత్తివేయడంతో ప్రైవేట్ ఫర్టిలైజర్ షాపుల యాజమానులు ఇష్టారాజ్యంగా ఎమ్మార్పీ కంటే అదనంగా ఎరువులు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటూ రైతుల జేబులు ఖాళీ చేస్తున్నారు. ధరలను నియంత్రించడంలో చంద్రబాబు ప్రభుత్వం విఫలమైందనే ఆరోపణలున్నాయి.

మూడు సబ్‌డివిజన్ల ఆర్‌బీకే హబ్‌ల మూత

- సొసైటీల ద్వారా ఎరువులు సరఫరా చేయిస్తామంటున్న అధికారులు
- రైతులకు ఇంకా చేరని వైనం
- ఫర్టిలైజర్ షాపుల వద్దే ఎరువులు కొనుగోలు చేస్తున్న అన్నదాతలు
- బస్తాకు రూ.100 నుంచి రూ.200 వరకు అదనంగా వసూలు



కందుకూరు రూరల్: రబీ సీజన్ మొదలైంది. రైతులు శనగ, వరితోపాటు, పొగాకు నాట్లు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎరువుల కోసం పరుగులు తీస్తున్నారు. ఇదే అదునుగా భావించిన ఫర్టిలైజర్ షాపుల డీలర్లు అందినకాడికి దండుకుంటున్నారు. ఒక్కో బస్తాపై రూ.100 నుంచి రూ.200 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. డీలర్ల షాపుల్లో స్టాక్ బోర్డుపై ఎమ్మార్పీ వివరాలు నమోదు చేసి ఉంటాయి. కానీ ఆ ధరలకు మాత్రం ఎరువులు ఇవ్వరు. ఒకవేళ రైతులడిగితే స్టాక్ లేని చెబుతున్నారు. దీంతో ఏం చేయలేక రైతులు వారు చెప్పిన ధరకు కొనుగోలు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వచ్చి కొనుగోలు చేస్తుండడంతో అదనపు ధరలతోపాటు రవాణా ఖర్చులు పెరిగాయి. దీనిని చూసిన రైతులు గత ప్రభుత్వంలో ఎలాంటి ఖర్చు లేకుండా గ్రామంలోని ఆర్‌బీకేలకే ఎరువులు వచ్చేవని చెబుతున్నారు.

వసూలు ఇలా..

యూరియా వాస్తవ ధర రూ.266 అయితే రూ.350, డీఏపీ రూ.1,350 ఉండగా రూ.1,480 తీసుకుంటున్నారు. 20 20 013 ధర రూ.1,300, 28.28 రూ.1,700, 14 35 14 రూ.1,800, అమ్మోనియం సల్ఫేట్ (జీఎస్‌ఎఫ్‌సీ) రూ.950, ఎస్‌ఎస్‌పీ రూ.615, ఎస్‌ఎస్‌పీ (పౌడర్) రూ.585, ఎంఓపీ రూ.1,550, ఫ్యాక్ట్ రూ.100 వాస్తవ ధరలు. వీటిపై రూ.100 నుంచి రూ.200 వరకు డీలర్ల అదనంగా వసూలు చేస్తున్నారు. ఈ ధరలు కందుకూరు పట్టణ ప్రాంతంలో. ఇక మండల కేంద్రాల్లో అయితే రూ.బస్తాపై రూ.300 వరకు వసూలు చేస్తున్నారు.

రైతు సేవా కేంద్రాలుగా మార్పు

కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా మార్పు చేసింది. పేరైతే మారింది కానీ సేవలన్నీ బంద్ కావడంతో అన్నదాతలు అయోమయంలో పడ్డారు. ఎరువులు, పురుగు మందులు కావాలంటే ఫర్టిలైజర్ షాపులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. యజమాని ఎంత ధర చెప్తే అంతకే కొనుగోలు చేయాలి. ఎరువుల ధరలు పెరగడంతోపాటు రవాణా ఖర్చులు కూడా పెరిగాయి.



మూతపడిన ఆర్‌బీకే హబ్

సరఫరా చేయలేదు

ప్రస్తుత ప్రభుత్వం సొసైటీ ద్వారా రైతులకు కావాల్సిన ఎరువులు తెప్పిస్తామని చెబుతోంది. కానీ ఇంత వరకు సొసైటీ ద్వారా ఎరువులు రైతులకు అందలేదు. కందుకూరు మండలంలో పలుకూరు, మోపాడు, మహదేవపురం సొసైటీల ద్వారా ఎరువులు సరఫరా చేయలేదు. సక్రమంగా కొనసాగుతున్న విధానాన్ని మార్చడంతో అంతా గందరగోళ పరిస్థితి సృష్టించారు. రైతుకు మేలు చేసే పని చేకుండా వ్యాపారులకు లబ్ధి చేకూర్చే విధానాలను చంద్రబాబు అవలంభిస్తోందని రైతులు విమర్శిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ఆర్‌బీకేల ద్వారా రైతులకు ఎన్నో సేవలందాయి. కందుకూరు మార్కెట్ యార్డ్‌లో మూడు వ్యవసాయ సబ్ డివిజన్లకు కలిపి ఒక ఆర్‌బీకే హబ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీని కింద 15 మండలాల పరిధిలో 226 ఆర్‌బీకేలుండేవి. వీటిల్లో కందుకూరు వ్యవసాయ సబ్ డివిజన్ కింద 72, కనిగిరి పరిధిలో 93, సింగరాయకొండ పరిధిలో 61 కేంద్రాలుండేవి. ప్రతి ఆర్‌బీకేలో డిజిటల్ కియోస్క్ యంత్రం ఉండేది. రైతులు ఎరువులు, పురుగు మందులు కావాలంటే దాని ద్వారా గ్రామ వ్యవసాయ సహాయకుల సహకారంతో ఆర్డర్ పెట్టుకునేవారు. 48 గంటల్లో ఆ కేంద్రానికి నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు చేరేవి. అక్కడి నుంచి రైతులు తీసుకెళ్తుండేవారు. ప్రస్తుతం మార్కెట్ యార్డులో ఉన్న ఆర్‌బీకే హబ్ మూత పడింది. ఈ విధానాన్ని కూటమి ప్రభుత్వం ఎత్తివేయడంతో హబ్ నిర్వీర్యమైంది.

క్లుప్తంగా

అంగన్‌వాడీలకు సరుకులు అందజేస్తాం

సాక్షి ఎఫెక్ట్..

ఉదయగిరి: అంగన్‌వాడీ కేంద్రాలకు సెప్టెంబర్ నెలకు సంబంధించి కందిపప్పు సరఫరా చేశామని, కొన్నిచోట్ల డీలర్ల వద్ద నిల్వ ఉందని, వెంటనే ఆయా కేంద్రాలకు అందించే ఏర్పాట్లు చేస్తామని ఐసీడీఎస్ అధికారి హేనాసుజన్ తెలిపారు. 'సాక్షి'లో ఆదివారం 'వంటకు నిత్యం తంటా' అనే శీర్షికతో కథనం వెలువడిన నేపథ్యంలో ఆమె స్పందించారు. ఈ నెలకు సంబంధించి కేంద్రాలకు నూనె సరఫరా కాలేదని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలో సరఫరా చేస్తామన్నారు. చెప్పారు. జిల్లాలో మూడు ప్రాజెక్ట్‌ల్లోని కేంద్రాలకు నిత్యావసర వస్తువులకు సంబంధించి ఆగస్టు నెల నుంచి నిధులు జమ కాలేదని, వెంటనే బకాయిలు అందించే ఏర్పాటు చేస్తామని చెప్పారు.

మహాప్రాకారం, గాలిగోపుర నిర్మాణాలకు భూమి పూజ



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన విధుశేఖర భారతి, మంత్రి ఆనం తదితరులు

బిట్రగుంట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో రూ.2.6 కోట్లతో ఆలయ గాలిగోపురం, రూ.1.65 కోట్లతో మహాప్రాకారం, రూ.23 లక్షలతో రథశాల నిర్మాణానికి ఆదివారం సాయంత్రం భూమి పూజ నిర్వహించారు. దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శృంగేరి శారదా ఉత్తర పీఠాధిపతి విధుశేఖర భారతి శాస్త్రోక్తంగా నిర్మాణాలకు భూమి పూజ చేశారు. తొలుత పీఠాధిపతికి ఆలయ అధికారులు, అర్చకులు మేళతాళాలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. క్షేత్రవాసి ప్రసన్న వేంకటేశ్వరస్వామికి, ఉభయదేవేరులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నిర్మాణాలకు భూమి పూజ నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆధ్యాత్మిక ప్రసంగం నిర్వహించారు. సృష్టిలోని సకల ప్రాణికోటికి భగవంతుడే ఆధారమన్నారు. మంత్రి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తమ్ముడి మరణంపై సోదరి ఫిర్యాదు

నెల్లూరు(క్రైమ్): తమ్ముడి మృతిపై అనుమానం ఉందని అక్క నెల్లూరు సంతపేట పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. సంతపేట కపాడిపాళేనికి చెందిన ఏసుదాసు, ఫాతిమా మేరీలు దంపతులు. వారికి పిల్లలు లేరు. ఫాతిమా అనారోగ్యంతో 2019లో చనిపోయారు. ఏసుదాసు బీఎస్‌ఎన్‌ఎల్‌లో పని చేశారు. పదవీ విరమణ అనంతరం బంధువుల సంరక్షణలో ఉంటున్నారు. నెలన్నర క్రితం ఆయన మృతిచెందాడు. ఏసుదాసు మృతిపై అనుమానం ఉందని కపాడిపాళేనికి చెందిన మృతుడి అక్క చంద్రమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పన్నుల వసూలుకు స్పెషల్ డ్రైవ్

- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ



మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నెల్లూరు(బారకాసు): పన్నుల వసూలుకు సోమవారం నుంచి శనివారం వరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. ఆదివారం నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉన్న సమావేశ మందిరంలో కమిషనర్ సూర్యతేజతో కలిసి మంత్రి రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగాలధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం నారాయణ మీడియాతో మాట్లాడారు. ప్రైవేట్ ఆస్తులకు సంబంధించిన యజమానులు సుమారు రూ.93.41 కోట్ల బకాయిలున్నారన్నారు. దీర్ఘకాలిక బకాయిలున్న వారు పదిరోజుల్లోపు చెల్లించాలని, లేనిపక్షంలో విద్యుత్ కనెక్షన్ తొలగించాలని ఆదేశించామన్నారు. కుళాయి కనెక్షన్లకు సంబంధించి రూ.29.93 కోట్లు బకాయిలున్నట్లు చెప్పారు. బిల్డింగ్స్, లేఅవుట్లకు సంబంధించిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. డిసెంబర్ 15 నాటికి నూతన నిబంధనలు తీసుకొస్తున్నామని దీంతో భవన నిర్మాణాలకు సంబంధించి ప్లాన్ అప్రూవల్ త్వరితగతిన అయ్యేలా చూస్తామన్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 107
లేయర్ (లైవ్) : 110
బ్రాయిలర్ చికెన్ : 200
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 224
లేయర్ చికెన్ : 187

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.45
సన్నవి : రూ.35
పండ్లు : రూ.20

మహిళను రక్షించిన పోలీసులు



మహిళను బంధువులకు అప్పగించిన పోలీసులు

ఇందుకూరుపేట: కుటుంబ సమస్యల కారణంగా ఇంట్లో చెప్పకుండా వచ్చి సముద్రంలో మునిగి ఆత్మహత్యకు ప్రయత్నించిన ఓ మహిళను ఇందుకూరుపేట పోలీసులు రక్షించారు. వారి కథనం మేరకు నంద్యాలకు చెందిన ఎస్కే మహబూబ్‌బీ ఇంట్లో చెప్పకుండా శనివారం మధ్యాహ్నం ఇందుకూరుపేట మండలం మైపాడు బీచ్ వద్దకు వచ్చింది. సముద్రంలో మునిగి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించింది. అక్కడ ఇందుకూరుపేట పోలీస్‌స్టేషన్ ఓపీ విధులు నిర్వహిస్తున్న ఉన్న ఏఎస్సై భాస్కర్‌రాజు ఆమెను కాపాడారు. స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా తనది నంద్యాల అని మాత్రమే చెబుతూ మిగిలిన విషయాలు చెప్పలేకపోయింది. దీంతో ఇందుకూరుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స చేయించారు. పూర్తి వివరాలు తెలుసుకున్న ఎస్సై నాగార్జునరెడ్డి నంద్యాల వన్ టౌన్ సీఐని సంప్రదించి అక్కడ పోలీసుల ద్వారా ఆమె బంధువులకు సమాచారం అందించారు. వారు ఇందుకూరుపేట పోలీస్‌స్టేషన్‌కు ఆదివారం చేరుకోగా మహబూబ్‌బీని అప్పగించారు.

క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: ప్రజల సమస్యలను ఎక్కడికక్కడే పరిష్కరించాలని, పరిపాలనను మరింత చేరువ చేసే ప్రయత్నంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని వికేంద్రీకరణ చేస్తున్నట్లు కలెక్టర్ ఒ.ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి క్షేత్ర స్థాయిలోనే మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం చేరువలోని మండల కార్యాలయాల్లో అర్జీలు అందించవచ్చన్నారు. అధికారులు ఫిర్యాదులను నిర్దిష్ట సమయంలోగా త్వరితగతిన పరిష్కరించాలని, పరిష్కారంలో అత్యున్నత ప్రమాణాలను పాటించాలన్నారు.

జూదరుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు నగరంలోని డైకస్‌రోడ్డులో సింగిల్ నంబర్లాటపై ఆదివారం నెల్లూరు వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ కిశోర్‌కుమార్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. సింగిల్ నంబర్లాడుతున్న ఎనిమిది మంది జూదరులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.1,000 నగదు, రెండు ఆటోలు, ఏడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

పేకాట ఆడుతుండగా..

సంగం: మండలంలోని జెండాదిబ్బ పరిసర ప్రాంతంలో ఆదివారం పేకాట ఆడుతున్నారనే సమాచారంతో సంగం ఎస్సై రాజేష్ దాడులు నిర్వహించారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రూ.5,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశామని, ఎవరైనా పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

పక్కాగా లార్వా సర్వే



ప్రజలతో మాట్లాడుతున్న కొండారెడ్డి

నెల్లూరు(అర్బన్): 'డెంగీ, మలేరియా లాంటి వ్యాధులు ప్రబలకుండా పక్కాగా లార్వా సర్వే చేయాలి. దోమల నిర్మూలనకు చర్యలు చేపట్టి సీజనల్ వ్యాధులను అరికట్టాలి' అని విజయవాడ నుంచి వచ్చిన ఎంటమాలజిస్ట్ ఎం.కొండారెడ్డి తెలిపారు. శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన ఆదివారం కూడా పలు ప్రాంతాలను పరిశీలించారు. ఎన్‌టీటీ కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. డైకస్ రోడ్డు సమీపంలోని లార్వా సర్వే, ఫీవర్ సర్వేను పరిశీలించారు. డెంగీ పాజిటివ్ వచ్చిన వారిని కలిసి వారి ఇంటి పరిసరాలు, కూలర్లు, ఫ్రిడ్జ్‌లను తనిఖీ చేసి నీరు నిల్వ ఉందా అని చూశారు. ఈ సందర్భంగా నీరు నిల్వ ఉన్న పలుచోట్ల లార్వా సర్వేను చేసి చూపించి ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. సర్వేలో డెంగీ, మలేరియా, ఫైలేరియా లాంటి జబ్బులు కలిగించే దోమలకు సంబంధించిన లార్వాలు ఉన్నట్టు తేలితే ఆయా ప్రాంతాల్లో రక్తనమూనాలు ఎక్కువగా సేకరించి ల్యాబ్‌లలో పరీక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ, సబ్ యూనిట్ అధికారులు శ్యాంసన్‌బాబు, రామారావు, నందకుమార్, మలేరియా నిర్మూలన సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల వేతనాలు పెంచాలి



ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నూతన జేఏసీ కమిటీ

నెల్లూరు(అర్బన్): వైద్యశాఖలో అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్న తమకు వెంటనే వేతనాలు పెంచాలని నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా చైర్మన్ ఎన్.సతీష్‌కుమార్ డిమాండ్ చేశారు. నెల్లూరు దర్గామిట్టలోని ప్రభుత్వ వైద్యకళాశాలలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల జేఏసీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులతో సమానంగా కూడా తమకు వేతనాలు ఇవ్వడం లేదన్నారు. ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరుకు లింకు పెట్టి 5 నిమిషాలు ఆలస్యమైనా జీతాల్లో కోత విధిస్తున్నారన్నారు. సమయానికి విధుల్లోకి వచ్చినా ఆన్‌లైన్‌లో సాంకేతిక లోపాలు, సిగ్నల్స్ సక్రమంగా లేకపోవడంతో కూడా సమయానికి ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు వేయలేకపోతున్నారన్నారు. మొదట లోపాలు సరిచేసి తర్వాతనే జీతాలకు లింకు పెట్టాలని కోరారు. అక్టోబర్ నెలలో కట్ చేసిన జీతాన్ని తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎఫ్‌ఆర్‌ఎస్‌కు గ్రేస్ పీరియడ్ 30 నిముషాలైనా ఇవ్వాలన్నారు. డిమాండ్లు పరిష్కరించకపోతే విధులు బహిష్కరించి ఆందోళన చేస్తామన్నారు. జీవానందం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎన్‌హెచ్‌ఎం చైర్మన్ దయామణి, జేఏసీ నాయకులు ఏడుకొండలు, సందానీబాషా, అబ్దుల్ రజాక్, ప్రసన్నకుమారి, ప్రవీణ్‌బాబీ, లక్ష్మీప్రసన్న, రాజేష్, మునెమ్మ, సత్యప్రియ పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

లా విద్యార్థిని ఆత్మహత్య



శ్రీలత మృతదేహం

కోవూరు: లా విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఆదివారం ఎస్సై రంగనాథ్ గౌడ్ వివరాలు వెల్లడించారు. కోవూరులో న్యాయవాది చింతగుంట శ్రీనివాసులు నివాసం ఉంటున్నారు. ఆయన కుమార్తె శ్రీలత (25) నెల్లూరులోని వీఆర్ లా కళాశాలలో 3వ సంవత్సరం చదువుతోంది. శనివారం ఇంట్లో తల్లిదండ్రులు లేని సమయంలో ఆమె చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రాత్రి ఇంటికొచ్చి చూసిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. శ్రీలతతో కలిసి చదువుతున్న అక్షయ భరత్ వల్లే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందనితల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేశారు. సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరా రు. శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆధార్‌కార్డు జెరాక్స్ తప్పనిసరి

నెల్లూరు(క్రైమ్): ప్రతి సోమవారం నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అర్జీదారులు ఆధార్‌కార్డు జెరాక్స్‌ను తప్పనిసరిగా తీసుకురావాలని జిల్లా పోలీసు కార్యాలయం తెలిపింది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనను విడుదల చేసింది.

సమస్యల భాండాగారాలు



శిథిలావస్థలో దుత్తలూరు గ్రంథాలయం



పెచ్చులూడిన స్లాబు

విజ్ఞాన భాండాగారాలుగా పేరొందిన గ్రంథాలయాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. వసతుల్లేక పాఠకులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. లైబ్రరీల నిర్వహణకు సైతం సిబ్బంది కొరత ఉంది. వారోత్సవాల సమయంలో గొప్పలు చెప్పే ప్రభుత్వ పెద్దలు, అధికారులు ఆ తర్వాత వాటి గురించి పట్టించుకోవడం లేదు.

- గ్రంథాలయాలకు సొంత భవనాల కొరత
- సిబ్బంది సంఖ్య తక్కువే
- రూ.40 కోట్ల మేర పేరుకుపోయిన సెస్ బకాయిలు

దుత్తలూరు: దేశ స్వాతంత్ర్య సమరంలో కీలక పాత్ర వహించిన గ్రంథాలయాలపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. దీంతో వీటి ఉనికి ప్రశ్నార్థకమైంది. విజ్ఞాన భాండాగారాలను నిధుల కొరత వేధిస్తోంది. అంతేకాక సొంత భవనాలు, సిబ్బంది కొరతతో నిర్వహణ గగనమైంది. ఉదాహరణకు మండల కేంద్రమైన దుత్తలూరులోని శాఖా గ్రంథాలయం కొన్ని దశాబ్దాలపాటు పాఠకులకు ఎంతో ఉపయోగపడింది. నిత్యం వందలాది మంది పాఠకులు వచ్చేవారు. క్రమేపీ పాఠకుల సంఖ్య తగ్గిపోయింది. దీనికి కారణం గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. కొత్త పుస్తకాల కొనుగోలుకు నిధుల కొరత ఏర్పడింది. దీంతోపాటు లైబ్రేరియన్ వారానికి రెండురోజులు (సోమ, మంగళవారాలు) ఇక్కడ.. మరో మండలంలో రెండురోజుల చొప్పున పనిచేయాల్సి వస్తోంది. దీంతో మిగిలిన రోజులు గ్రంథాలయం మూతపడి ఉంటుంది. సిబ్బంది కొరతతో జిల్లాలో ఒక్కొక్కరు రెండు, మూడు లైబ్రరీలు చూసుకోవాల్సిన పరిస్థితి ఉంది.

వసతులు కల్పించకపోవడంతో..

ప్రజల నుంచి సెస్ రూపంలో రూ.కోట్లు పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు చెల్లిస్తున్నా అవి గ్రంథాలయాలకు చేరకపోవడంతో పాఠకులకు వసతులు సమకూరడం లేదు. ఉమ్మడి జిల్లాలోని 961 గ్రామపంచాయతీలు, నెల్లూరు నగర కార్పొరేషన్, మిగిలిన మున్సిపాలిటీలు, ఏపీఐఐసీ నుంచి సెస్ రూపంలో రూ.40 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయినట్లు అధికారుల సమాచారం. ఇవి సక్రమంగా చెల్లించకపోవడంతో పేరుకుపోయాయి. గతంలో కొంతమంది పదవీ విరమణ చేయగా ఆ ఖాళీలు భర్తీ కాలేదు. మరి కొన్నినెలల్లో భారీస్థాయిలో పదవీ విరమణ చేసే అవకాశముందని సిబ్బంది చెబుతున్నారు. దీంతో ఉన్నవారిపైనే భారం పడింది.



ఇటీవల నెల్లూరులో వారోత్సవాలను ప్రారంభిస్తున్న అధికారులు

శిథిలావస్థకు..

ఉమ్మడి జిల్లాలో 28 లైబ్రరీలకు సొంత భవనాలున్నాయి. 31 ఫ్రీరెంట్ భవనాల్లో, రెండు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్ర గ్రంథాలయ భవన నిర్మాణం పూర్తి కాలేదు. అలాగే ఇందుకూరుపేట, సైదాపురం, మనుబోలు, దగదర్తి, ఏఎస్‌పేట, దుత్తలూరు, పొదలకూరు, కలువాయి, సంగం తదితర మండలాల్లోని గ్రంథాలయాలు శిథిలావస్థకు చేరాయి. కొత్తవి నిర్మించాలంటే ప్రభుత్వం నిధులు విడుదల చేయాల్సి ఉంది. ఒక్కో భవన నిర్మాణానికి రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చవుతుందని అధికారులు చెబుతున్నారు. ప్రతి సంవత్సరం వారోత్సవాలు నిర్వహిస్తుంటారు. కానీ లైబ్రరీల అభివృద్ధి గురించి మాత్రం పట్టించుకోవడం లేదు. గ్రంథాలయాలకు మళ్లీ పూర్వ వైభవం తీసుకొచ్చి ప్రజలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలి.

మొదలైన వారోత్సవాలు

ఈనెల 14వ తేదీన 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు మొదలయ్యాయి. ఇవి ఈనెల 20వ తేదీ వరకు జరుగుతుతాయి. రోజుకో అంశం చొప్పున కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలాగే విద్యార్థులకు గ్రంథాలయాలపై అవగాహన కల్పిస్తున్నారు.

వారోత్సవాలను నిర్వహిస్తున్నాం

ఈనెల 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నాం. రూ.40 కోట్ల మేర సెస్ బకాయిలు ఉన్నమాట వాస్తవమే. లైబ్రరీల సమస్యలపై ఎప్పటికప్పుడు అధికారులకు తెలియజేస్తున్నాం. గ్రంథాలయాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం.

– కుమారరాజా, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి